సాక్షి
మహబూబాబాద్

ఆదివారం | 2 | జూన్ | 2024



నకిలీ పత్తి విత్తనాల స్వాధీనం

నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాలోని సభ్యుడితోపాటు ప్రభుత్వ నిషేధిత గడ్డిమందును విక్రయిస్తున్న మరో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. - 8లో▸



పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల రద్దు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో చేపట్టిన సీఓపీ వర్క్స్ కారణంగా కాజీపేట, వరంగల్ స్టేషన్ల మీదుగా బల్లార్షా, విజయవాడ మార్గాల్లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేశారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
44.8°/29.6°

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు వడగాలులు వీస్తాయి. అలాగే ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రసవాలపై అవగాహన కల్పించాలి



బయ్యారం: గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవించేలా వైద్యసిబ్బంది అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ అంబరీష సూచించారు. మండలంలోని బయ్యారం పీహెచ్‌సీతో పాటు ఉప్పలపాడు సబ్‌సెంటర్‌ను శనివారం ఆయన సందర్శించారు. ఉప్పలపాడు సబ్‌సెంటర్ పరిధిలోని లక్ష్మీనర్సింహపురం గ్రామానికి చెందిన బాలింత ఆరునెలల క్రితం మహబూబాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో మృతి చెందిన ఘటనపై ఆయన విచారణ చేపట్టారు. అనంతరం వైద్యసిబ్బందితో మాట్లాడుతూ... రానున్న వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తిచెందకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట సబ్‌యూనిట్ ఆఫీసర్ వడ్డెబోయిన శ్రీనివాస్, సీహెచ్ఓ కృష్ణార్జున, వైద్యసిబ్బంది తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

మహబూబాబాద్ అర్బన్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 3నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు డీఈఓ రామారావు శనివారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని రెండు పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 591మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు గంట ముందు హాజరుకావాలన్నారు. ప్రతి సెంటర్ వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. సెల్‌ఫోన్స్, ఎలక్ట్రానిక్ వస్తువులను హాల్‌లోకి అనుమతించొద్దన్నారు.

విత్తనాలు, ఎరువుల షాపుల తనిఖీ

గూడూరు: నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఏడీఏ లక్ష్మీనారాయణ, సీఐ బాబురావు అన్నారు. మండల కేంద్రంలోని విత్తనాలు, ఎరువుల షాపులను శనివారం పోలీస్, వ్యవసాయ శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి షాపు స్టాక్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు విక్రయించే విత్తనాలు, ఎరువులకు బిల్లులు ఇవ్వకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై సీహెచ్ గణేష్, ఏఓ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం చేయాలి



మహబూబాబాద్ అర్బన్: బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటా ప్రచారం చేసి ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని డీఈఓ రామరావు అన్నారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో శనివారం పలు ఉపాధ్యాయ సంఘాల బాధ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ రామారావు మాట్లాడుతూ.. ఆదర్శ మహిళా సంఘాల సహాయ సహకాలు తీసుకొని పిల్లల నమోదుశాతం పెంచేందుకు కృషి చేయాలన్నారు. బడిఈడు పిల్లలందరూ బడిలో మాత్రమే ఉండాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి విద్యార్థులను నేరుగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించాలన్నారు. జూన్, జూలైలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. అన్ని ఉపాధ్యాయ సంఘాలు ఏకమై మూతబడిన స్కూళ్లను తెరిపిస్తామని, విద్యాభివృద్ధి తమ వంతు కృషి చేస్తామని నాయకులు డీఈఓకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంక బద్రినారాయణ, మురళీకృష్ణ, శ్రీశైలం, యాకూబ్, వాసుదేవ్, కిషన్, ప్రభాకర్, శ్రీనివాస్, భీముడు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను బడిలో చేర్పించాలి

మహబూబాబాద్: బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని డీఈఓ రామారావు అన్నారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో బడి బాట కార్యక్రమంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ.. బడి బయట ఉన్న పిల్లల్ని బడిలో చేర్పించేందుకు మండల సమీక్ష సభ్యులు పాటుపడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.రవీందర్, మెప్మా డీఎంసీ విజయ, మున్సిపల్ మేనేజర్ శ్రీధర్, ఆర్‌సీలు పాల్గొన్నారు.

పోరుగల్లు

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం నినదించిన ఓరుగల్లు
ఉవ్వెత్తున ఎగిసిన ఉద్యమం.. ఆకాంక్ష తీరేవరకు సమరం
2003లో జైత్రయాత్ర... 2010లో ఓరుగల్లు గర్జన

- 'ప్రత్యేక' ఉద్యమంలో కీలక పాత్ర
- భగ్గుమన్న కేయూసీ, కదంతొక్కిన సబ్బండవర్గాలు
- నేడు పదేళ్ల తెలంగాణ పండుగ..
- రాష్ట్ర అవతరణ వేడుకలకు భారీగా ఏర్పాట్లు



ఉద్యమ కాలం నాటి చిత్రాలు



సాక్షి ప్రతినిధి, వరంగల్:

ఉద్యమాల ఖిల్లా.. పోరాటాల జిల్లా ఓరుగల్లు నుంచే 'ప్రత్యేక రాష్ట్ర' ఉద్యమ పొలికేక తొలిసారి వినిపించింది. తొలిదశ ఉద్యమం.. మలి ఉద్యమానికి ఊపిరిలూదిన కాకతీయుల గడ్డ పోరాట స్ఫూర్తి చరిత్ర ఉన్నంతకాలం సజీవం. స్వరాష్ట్ర ఆకాంక్షకు కాకతీయ విశ్వవిద్యాలయం కేంద్రంగా మారగా.. ప్రజల అండదండలతో జేఏసీలు, సబ్బండవర్గాలు ఆ ఉద్యమాన్ని ఉధృతంగా సాగించాయి. పడుతూ.. లేస్తూ ఆరు దశాబ్దాల కలను నెరవేర్చుకోవడం కోసం ఉవ్వెత్తిన ఎగిసిన మలి దశ ఉద్యమానికి ఓరుగల్లు పౌరుషం ఊతమిచ్చింది. రాష్ట్ర సాధనే ఊపిరిగా బతికిన ఉద్యమకారులు మలిదశలో ఉమ్మడి వరంగల్ నుంచి 361 మంది తమ ప్రాణాలను త్యాగం చేశారు. చివరికి అనేక ఉద్యమాలు, అరెస్టులు, కేసులు, పోరాటాల ఫలితంగా 2014 జూన్ 2న దేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ అవతరించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి నేటితో పదేళ్లు కాగా.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది.

ఓరుగల్లు నుంచే మలిదశ ఉద్యమం

మలిదశ తెలంగాణ ఉద్యమం 2001లో కాకతీయ విశ్వవిద్యాలయం నుంచే పురుడు పోసుకున్నది. 2001 మే 17న కరీంనగర్‌లో లక్షలాది మందితో 'సింహగర్జన' పేరిట భారీ బహిరంగ సభ నిర్వహించిన కేసీఆర్.. వరంగల్‌పై దృష్టి సారించారు. అప్పటికే తెలంగాణ సిద్ధాంతకర్త, 'ప్రత్యేక' ఉద్యమంలో కీలకంగా ఉన్న ప్రొఫెసర్ జయశంకర్‌తోపాటు పలువురు మేధావులు, విద్యార్థులు ఉద్యమాలు చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ సారథ్యంలో సాగిన ఉద్యమంలో మేధావులు, కవులు, కళాకారులు, జిల్లా ప్రజలంతా మమేకమయ్యారు. దీంతో 2003 ఏప్రిల్ 27న టీఆర్ఎస్ రెండో వార్షికోత్సవ సభను వరంగల్‌లో నిర్వహించారు. ఈ సభకు దేవెగౌడ, అజిత్‌సింగ్ హాజరయ్యారు. 'వరంగల్ జైత్రయాత్ర' పేరుతో నిర్వహించిన ఈ సభకు లక్షలాది మంది హాజరయ్యారు. ఈ సభ జరిగిన తీరు, ప్రజల పోరాట స్ఫూర్తి ఢిల్లీకి తాకి ఉద్యమంలో కలిసొచ్చే పార్టీలు, నాయకుల సంఖ్య పెరిగింది. 2004లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్న టీఆర్ఎస్ (బీఆర్ఎస్) పార్టీకి ఓరుగల్లు ప్రజలు అండగా నిలిచారు. స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, నర్సంపేట, పరకాల, హనుమకొండ (వరంగల్ పశ్చిమ) నియోజకవర్గాల్లో అభ్యర్థులు విజయం సాధించారు. వరంగల్ ఎంపీగా డి.రవీంద్రనాయక్ గెలిచారు.

మహా కూటమికి వేదిక.. మహాగర్జనతో ఢిల్లీకి సెగ..

2009 జనవరి 31న టీడీపీ, టీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ మధ్య పొత్తు కుదిరిన విషయం తెలిసిందే. 'మహా కూటమి' పేరుతో ఎన్నికల బరిలోకి దిగేందుకు పొత్తుల ప్రక్రియకు వరంగలే వేదిక కాగా.. ప్రొఫెసర్ జయశంకర్ కీలకంగా వ్యవహరించారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ ఒంటరిగా బరిలోకి దిగింది. కాంగ్రెస్, మహాకూటమి, ప్రజారాజ్యం పార్టీల మధ్య త్రిముఖ పోటీ నెలకొనగా కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వచ్చింది. ఇదే సమయంలో 'హైదరాబాద్ ఫ్రీజోన్' అని 2009 అక్టోబర్ 9న సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ఇది రాష్ట్రపతి ఉత్తర్వులకు, ముల్కీ రూల్స్‌కు విరుద్ధమని ఈ తీర్పును వ్యతిరేకిస్తూ టీఆర్ఎస్, ఉద్యోగ సంఘాలు, విద్యార్థులు ఆందోళనకు దిగారు. కాకతీయ విశ్వవిద్యాలయం విద్యార్థులు దీక్షకు దిగారు. వారికి సంఘీభావం తెలిపేందుకు కేయూసీకి కేసీఆర్ వచ్చారు. మెదక్ జిల్లా రంగధాంపల్లిలో 2009 నవంబర్ 29న దీక్షకు దిగనున్నట్లు కేయూసీ వేదికగా ప్రకటించారు. 2010 డిసెంబర్ 16న హనుమకొండ ప్రకాశ్‌రెడ్డిపేటలో నిర్వహించిన మహాగర్జనకు సుమారు 25లక్షల మంది ప్రజలు హాజరయ్యారు. ఈ మహాసభ గిన్నిస్‌బుక్ రికార్డులకెక్కి వరంగల్ పేరు ప్రపంచవ్యాప్తంగా మార్మోగేలా చేసింది. 2011 సెప్టెంబర్ 13 నుంచి అక్టోబర్ 25 వరకు 42 రోజులు సాగిన సకల జనుల సమ్మెలో యావత్ జిల్లా ప్రజానీకం భాగస్వామ్యమైంది. 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో ప్రజల చిరకాల వాంఛ నెరవేరింది. కాగా, ప్రతి సంవత్సరం జూన్ 2న ఘనంగా ఆవిర్భావ వేడుకలను ప్రభుత్వం అత్యంత ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. పదేళ్లయిన సందర్భంగా ఆదివారం కనుల పండువగా రాష్ట్ర అవతరణ వేడుకలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

2009 నుంచి ఉవ్వెత్తున...

కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు 2009 నవంబర్ 29న చేపట్టిన నిరాహార దీక్ష ఉద్యమానికి కొత్తరక్తం ఎక్కించింది. తెలంగాణలోని అన్ని జిల్లాల కన్నా మిన్నగా ఉద్యమంలో వరంగల్ అగ్రభాగాన నిలిచింది. రోడ్ల మీదికి వచ్చి సబ్బండవర్గాలు నిరసనలు తెలిపాయి. సకల జనుల సమ్మెలో సంపూర్ణంగా పాల్గొన్నారు. రహదారులు, రైల్వే ట్రాక్‌ల దిగ్బంధాలు, రోడ్లపై వంటావార్పు, మహిళలు బతుకమ్మలతో ఊరేగింపులు, ర్యాలీలు, రాస్తారోకోలు నిత్యకృత్యంగా సాగాయి. ఆ సమయంలో కాకతీయ విశ్వవిద్యాలయ విద్యార్థులు ఉద్యమాన్నే పొత్యాంశంగా స్వీకరించారు. విద్యార్థులు ఏకోన్ముఖంగా ఉద్యమ బాటలో నడిచారు. 2010 ఫిబ్రవరి 7న కేయూ క్యాంపస్‌లో వేలాది మంది విద్యార్థులతో జరిగిన 'పొలికేక'కు స్వామి అగ్నివేశ్, తెలంగాణ సిద్ధాంతకర్త కొత్తపల్లి జయశంకర్ హాజరు కాగా.. ఆ సభ ఓ చరిత్ర సృష్టించింది. విశ్వవిద్యాలయం ప్రాంగణంలో, ప్రధాన ద్వారాల వద్ద నెలల తరబడి దీక్షా శిబిరాలు కొనసాగాయి. కళాకారుల డప్పుమోతలు, ఊర్రూతలూగించే గాయకుల పాటలు ఉమ్మడి వరంగల్‌ను మోతెక్కించాయి. కవులు, కళాకారులు ఉద్యమాన్ని సజీవంగా ఉంచడంలో నిరుపమాన కృషి చేశారు. బోనాలు, బతుకమ్మ మొదలైన తెలంగాణ పండుగలను రుతువులకతీతంగా ఘనంగా జరుపుకున్నారు. కొత్తకొత్త ప్రక్రియలు, నిరసన రూపాలతో ఉరకలెత్తించారు. వాటి ఫలితమే ప్రత్యేక రాష్ట ఏర్పాటు. అవన్నీ ఉద్యమంలో కీలకఘట్టాలయ్యాయి.



కలెక్టరేట్ ఎదురుగా అమరవీరుల కీర్తి స్థూపం వద్ద విజయోత్సవ సంబరాలు(ఫైల్)





రాష్ట్ర ప్రకటన అనంతరం కాగడాలతో ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యమకారులు, యువత కేరింతలు (ఫైల్)

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

తొర్రూరు: నియోజకవర్గంలో నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి హెచ్చరించారు. శనివారం పట్టణంలోని ఎరువులు, విత్తన దుకాణాలను ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువులు, పలు కంపెనీల విత్తన ప్యాకెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిందన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ విత్తనాల కొరత లేదన్నారు. రైతులు లైసెన్స్ పొందిన డీలర్ల వద్ద మాత్రమే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. విత్తనాలు, ఎరువుల కొనుగోలు సమయంలో రైతులు రశీదులను తీసుకొని భద్రపరుచుకోవాలన్నారు. విత్తనాలు అక్రమంగా స్టోర్ చేసినా, రవాణా చేసినా, విడిగా అమ్మినా జరిమానాతో పాటు శిక్షకు గురి కావాల్సి వస్తుందన్నారు. రైతులను మోసగిస్తే పీడీ యాక్టు నమోదు చేసి శిక్షిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ లింగాల వెంకటనారాయణ గౌడ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



తొర్రూరు పట్టణ కేంద్రంలో ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

నాణ్యతలేని విత్తనాలు విక్రయించొద్దు

పెద్దవంగర: రైతులకు నాణ్యతలేని విత్తనాలు విక్రయించొద్దని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి వ్యాపారులు, డీలర్లను ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలోని గ్రోమోర్ సెంటర్‌ను సందర్శించి పలు రికార్డులను తనిఖీచేసి విత్తనాలు, ఎరువుల నిల్వలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డీలర్లు ప్రభుత్వ అనుమతి పొందిన విత్తనాలను మాత్రమే విక్రయించాలని పేర్కొన్నారు అనంతరం మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో గుడుంబా తయారు చేస్తున్నారని స్థానిక మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆమె సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసి తయారీని అరికట్టుతామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేష్, నాయకులు కుమారస్వామి, శ్రీనివాస్ గౌడ్, సతీష్ పాల్గొన్నారు.

గుడుంబా తయారు చేస్తే చర్యలు

- ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, డీపీఈఓ బి.కిరణ్

మహబూబాబాద్ రూరల్: గుడుంబా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పీడీయాక్టు కేసులు నమోదు చేస్తామని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, డీపీఈఓ బి.కిరణ్ హెచ్చరించారు. జిల్లాను గుడుంబారహితంగా మార్చాలనే ప్రణాళిక అమలులో భాగంగా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, డీపీఈఓ బి.కిరణ్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ మండలంలోని బోడగుట్ట తండా గ్రామంలో శనివారం కార్డన్ సెర్చ్,గుడుంబా స్థావరాలపై పోలీసు, ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నాటుసారాయి తయారీ వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇకనుంచి ఎవరు కూడా సారాయి తయారీ, బెల్లం, పటిక జోలికెళ్లొద్దని హెచ్చరించారు. ఆగస్టు 31వరకు గుడుంబా రహిత జిల్లాగా మార్చేందుకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. 53 లీటర్ల సారాయి, 10 క్వింటాళ్ల బెల్లం స్వాధీనం చేసుకుని, 2,700 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. అరుణ, విజయ, కమిలీ, లలిత, సునీత, కవిత,మల్సూర్,సంధ్య, చిల్కీ, సత్తి, ఉమాపై కేసు నమోదు చేశారు. ట్రైనీ ఐపీఎస్ పండరి చేతన్, డీఎస్పీ తిరుపతిరావు, రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సైలు దీపిక, గోపి, వంశీధర్, మౌలానా, సురేష్, ఎక్సైజ్ సీఐ చిరంజీవి, వరంగల్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ నాగేశ్వర్ రావు, గూడూరు ఎక్సైజ్ సీఐ భిక్షపతి, ఎస్సైలు అశోక్, మౌనిక, కిరీటి, అనిల్, రజిత, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, డీపీఈఓ కిరణ్

నేడు రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కలెక్టరేట్‌లో ఏర్పాట్లు

- జాతీయ జెండా ఆవిష్కరించనున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్
- అమరవీరుల స్థూపం వద్ద నివాళులు
- ప్రభుత్వ కార్యాలయాల్లో జెండాలు అవిష్కరించనున్న అధికారులు

మహబూబాబాద్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు జిల్లాలో ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు తగు ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. జాతీయ జెండా ఆవిష్కరణలో భాగంగా జెండా గద్దెలకు రంగులు వేశారు. పలు ప్రభుత్వ కార్యాలయాలను అందంగా అలంకరించారు.

కలెక్టరేట్‌లో వేడుకలు..

జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో దశాబ్ది ఉత్సవాలకు తగిన ఏర్పాట్లు చేశారు. విద్యుత్ దీపాల అలంకరణతో పాటు పలు ఏర్పాట్లు చేశారు. వేడుకల్లో భాగంగా ఆదివారం ముందుగా ముత్యాలమ్మగుడి సెంటర్‌లోని అమరవీరుల స్థూపం వద్ద ఉదయం 8.30గంటలకు కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు నివాళులు అర్పించనున్నారు. కలెక్టరేట్‌లో ఉదయం 8.55గంటలకు కలెక్టర్ పోలీస్‌శాఖ నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారు. ఆ తర్వాత 9గంటలకు కలెక్టర్ జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. ఉదయం 9.05గంటకు కలెక్టర్ ప్రసంగం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ వల్ల అవార్డులు ఇతర కార్యక్రమాలు ఉండవని అధికారులు తెలిపారు.



వేడుకలకు ముస్తాబైన కలెక్టరేట్

జెండా ఆవిష్కరణ..

అన్ని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రభుత్వ విద్యాసంస్థల్లో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నారు. అందుకు అధికారులు జెండా గద్దెతోపాటు జెండాలు ఇతర అన్ని ఏర్పాట్లు చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలతో పాటు పలు సంఘాల ఆధ్వర్యంలో జాతీయ జెండాలను ఆవిష్కరించనున్నారు. కోడ్ వల్ల అధికార కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులు దూరం ఉండనున్నారు.

13 నుంచి దూర విద్య డిగ్రీ పరీక్షలు

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో దూరవిద్య డిగ్రీ బీఏ, బీకాం, (జనరల్ అండ్ కంప్యూటర్స్), బీబీఏ, బీఎస్సీ ఫైనల్ ఇయర్ (ఇయర్ వైజ్) పరీక్షలు ఈనెల 13 నుంచి, సెకండియర్ పరీక్షలు 14 నుంచి, మొదటి సంవత్సరం ఎక్స్ స్టూడెంట్స్) పరీక్షలు 18 నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి నరేందర్ తెలిపారు. ఆయా కోర్సుల ఫైనల్ ఇయర్ పరీక్షలు ఈనెల 13, 19, 25, 28, జూలై 2, 5, 9, 12 తేదీల్లో పరీక్షలు మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతాయని వారు తెలిపారు. డిగ్రీ కోర్సుల సెకండియర్ పరీక్షలు ఈనెల 14, 20, 26, 29, జూలై 3, 6, 10 తేదీల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. డిగ్రీ కోర్సుల మొదటి సంవత్సరం (ఎక్స్ విద్యార్థులకు) ఈనెల 18, 21, 27, జూలై 1, 4, 8, 11 తేదీల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతాయని వారు తెలిపారు.

ఫ్యాకల్టీ ఓరియంటేషన్-24 ప్రారంభం

కాజీపేట అర్బన్: నిట్‌లోని బోస్ హాల్‌లో శనివారం ఐదు రోజుల ఫ్యాకల్టీ ఓరియంటేషన్ ప్రోగ్రాం-24 అట్టహాసంగా ప్రారంభమైంది. నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ, ఐఐటీ భువనేశ్వర్ డైరెక్టర్ శ్రీపాద్ కర్మాల్కర్లు సంయుక్తంగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. అధ్యాపకులకు ఆధునిక టెక్నాలజీతో కూడిన విద్యా బోధనకు ఓరియంటేషన్ ప్రోగ్రాం వేదికగా నిలవాలన్నారు. కార్యక్రమంలో నిట్ ప్రొఫెసర్ వేణువినోద్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



లైంగిక దాడులను నిర్మూలిద్దాం

హన్మకొండ: బాలలపై ఆన్‌లైన్‌లో జరుగుతున్న లైంగికదాడులను నిర్మూలిద్దామని మత పెద్దలు పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండ సుబేదారిలోని అసుంత భవన్‌లో ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ, చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన పూజారులు, ముస్లిం కాజీలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కమ్యూనిటీ నాయకులకు బాలలపై ఆన్‌లైన్‌లో జరుగుతున్న వేధింపులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ పూజారుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కారంపూడి కృష్ణమూర్తి సిద్ధాంతి ఆచార్యులు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో బాలలు ఆన్‌లైన్ విధానంలో అనేక రకాలుగా వేధింపులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీని నిర్మూలనకు దేవాలయాల్లో ముఖ్యంగా ప్రవచనాలతో పాటు వేధింపులపై తల్లిదండ్రులకు, పిల్లలకు అవగాహన కలిగిస్తామన్నారు. బాల్య వివాహాలు, బాలల అక్రమ రవాణా జరగకుండా కృషి చేస్తామని, ఈ దిశగా కార్యాచరణ చేపట్టి ఒక డిక్లరేషన్ రూపంలో సంఘటితంగా నిర్ణయం తీసుకోవాల్సిన అవసరముందన్నారు. పరకాల


సదస్సులో మాట్లాడుతున్న కారంపూడి కృష్ణమూర్తి

ఇమామ్ కాజీ అజిదున్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో పిల్లలకు మొబైల్ వాడకంపై తగు జాగ్రత్తలు, భద్రతను నేర్పాలన్నారు. ఆన్‌లైన్‌లో బాలలపై జరుగుతున్న వేధింపులను నిర్మూలించేందుకు సంఘటితంగా ముందుకు సాగాలన్నారు. ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు కో ఆర్డినేటర్లు బత్తుల కరుణ, ఎర్ర శ్రీకాంత్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ఫీల్డ్ కో ఆర్డినేటర్ ఈసంపల్లి సుదర్శన్, మేనేజర్ మైలవరపు అజయ్ కుమార్, కాజీలు అజీజుద్దీన్, అబ్దుల్లా, అక్రం, పూజారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురి మృతి

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా శనివారం వేర్వేరు ఘటనల్లో నలుగురు మృతి చెందారు. మహదేవపూర్‌లో యువకుడు, పాముకాటుతో మహిళ, నీటిసంపులో పడి వ్యక్తి, స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఒకరు మృతి చెందారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు..


ప్రవీణ్(ఫైల్)

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం మద్దులపల్లి శివారు అటవీప్రాంతంలో దుర్గం ప్రవీణ్(27)అనే యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి.. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం బోరంపల్లి గ్రామానికి చెందిన ప్రవీణ్ శుక్రవారం బోరంపల్లి నుంచి తన అమ్మమ్మ గ్రామమైన భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం మద్దులపల్లికి కాలినడక గోదావరి దాటి వచ్చాడు. కానీ అమ్మమ్మ ఇంటికి వెళ్లలేదు. శనివారం ఉదయం మృతుడి సోదరుడు దుర్గం ప్రదీప్ అమ్మమ్మ ఇంటికి ఫోన్ చేసి వాకబు చేయగా ఇంటికి రాలేదని తెలిపారు. దీంతో ఆయన గోదావరి దాటి కాలినడకన వస్తుండగా ఓ చెట్టు వద్ద మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందజేయగా వారు సంఘటన స్థలానికి చేరుకుని శవపంచనామా చేశారు. మృతదేహంపై కాళ్లకు, చేతులకు, వెన్నముకకు కమిలిన గాయాలు ఉన్నట్లు గుర్తించారు. మృతుడి సోదరుడు ప్రదీప్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహదేవపూర్ ఆస్పత్రికి తరలించారు. అయితే అడవి జంతువుల కోసం వేసిన విద్యుత్ తీగలకు తగిలి మృతి చెందాడా లేదా వడదెబ్బతో మృతి చెందాడా అనేది పోస్టుమార్టం రిపోర్టులో తేలనుందని పోలీసులు పేర్కొంటున్నారు. ఘటనా స్థలాన్ని సీఐ రాజేశ్వర్‌రావు పరిశీలించారు. కాగా సబ్ డివిజన్ పరిధిలో ఇలాంటి ఘటనలు చాలా జరుగుతున్నా.. సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. నిత్యం అడవుల్లో వేటాడటం నిత్యకృత్యంగా మారిందని సమాచారం. వేటగాళ్లు మాత్రం బరితెగించారని ఆరోపణలు ఉన్నాయి.

పాముకాటుతో మహిళ..


దండెమ్మ (ఫైల్)

నర్మెట: పాముకాటుతో మహిళ మృతి చెందిన సంఘటన జనగామ జిల్లా నర్మెట మండలంలోని హన్మంతాపూర్‌లో శనివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మ్యాక దండెమ్మ (60) దిన చర్యలో భాగంగా తన వ్యవసాయ బావి వద్ద పాడి పశువులకు పచ్చి రొట్ట కోస్తున్న క్రమంలో కుడి చేతిపై పాము కాటు వేసింది. వెంటనే తేరుకుని పొరుగు రైతు సహాయంతో నర్మెట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకోగా వైద్యుల సూచనతో మెరుగైన వైద్యం కోసం జనగామకు తరలిస్తున్న క్రమంలో ఆమె మృతి చెందింది. మృతురాలికి వివాహితులైన కుమారుడు, కూతురు ఉన్నారు.

నీటి సంపులో పడి వ్యక్తి..


లక్ష్మీనర్సు(ఫైల్)

మరిపెడ రూరల్: ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం చిల్లంచర్ల గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దొంతు లక్ష్మీనర్సు (55) 15 సంవత్సరాల క్రితం భార్య వదిలేసి పోవడంతో ఒంటరిగా జీవిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం ఇంటి ఆవరణలోని నీటి సంపు (ఓడలతో నిర్మించిన లోతైన నీటి గుంత)లో నుంచి నీటిని తోడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి లక్ష్మీనర్సు సంపులో పడిపోయాడు. శనివారం తెల్లవారు జామున ఇంటి సమీపంలోని వారు చూసి హైదరాబాద్‌లో ఉన్న మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చెట్టును ఢీకొట్టిన వ్యాన్, డ్రైవర్..


చెట్టును ఢీకొట్టడంతో నుజ్జునుజ్జయిన వ్యాన్

తల్లాడ: ఖమ్మం జిల్లా తల్లాడ మండలంలోని మిట్టపల్లి హైవే బ్రిడ్జి సమీపాన వ్యాన్ చెట్టుకు ఢీకొట్టిన ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. తల్లాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన డ్రైవర్ వక్కల శ్రీనివాస్ వరంగల్ నుంచి డీసీఎంలో తిరుపూరు వెళ్లి సరుకులు అన్‌లోడ్ చేసి శనివారం ఉదయం వస్తున్నాడు. ఈనేపథ్యంలో మిట్టపల్లి హైవే బ్రిడ్జి దాటాక కుడి పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టాడు. దీంతో డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోగా, ఎస్సై కొండల్‌రావు సిబ్బందితో చేరుకుని జేసీబీ సాయంతో డ్రైవర్‌ను బయటకు తీయించి 108లో ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తమ్మారపు వెంకటేశ్వర్లు తెలిపారు.

యువ రైతు ఆత్మహత్యాయత్నం

- భూమి విషయంలో అటవీ శాఖ అధికారులతో వాగ్వాదం


ఒంటిపై డీజిల్ పోసుకున్న హుస్సేన్

ఏటూరునాగారం: భూమి చదును చేస్తుండగా.. అటవీశాఖ అధికారులు అడ్డుకోవడంతో ఓ వ్యక్తి శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని పెద్ద వెంకటాపురం గ్రామానికి చెందిన రైతు హుస్సేన్ తన పట్టా భూమిని చదును చేస్తుండగా రేంజ్ అధికారి నరేందర్ తన సిబ్బందితో కలిసి అడ్డుకున్నారు. దీంతో రైతులు, అటవీ శాఖ అధికారుల మధ్య వాగ్వాదం నెలకొంది. ఈనేపథ్యంలో మనస్తాపానికి గురైన హుస్సేన్ తన ఒంటిపై డీజిల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. తమకు పోడు పట్టాలున్నాయని, తమను వేధింపులకు గురిచేస్తున్నారని వాపోయారు. ఈ విషయంపై రేంజ్ అధికారి నరేందర్‌ను వివరణ కోరగా.. హుస్సేన్ చదును చేస్తున్న భూమి ఫారెస్ట్ పరిధిలోనే ఉందన్నారు. దానికి ఎలాంటి పట్టాలు లేవని తెలిపారు. ఏదైనా ఆధారాలుంటే తమ కార్యాలయానికి తీసుకురావాలని ఆయన సూచించారు.



నకిలీ పత్తి విత్తనాల స్వాధీనం

రూ.10లక్షల విలువ గల 310కిలోల సీడ్స్ పట్టివేత

- 122 లీటర్ల గడ్డిమందు కూడా..
- వివరాలు వెల్లడించిన సీపీ అంబర్ కిషోర్ ఝూ


పట్టుబడిన నకిలీ విత్తనాలు, పట్టుకున్న అధికారులతో సీపీ అంబర్ కిషోర్ ఝూ

వరంగల్ క్రైం: నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాలోని సభ్యుడితోపాటు ప్రభుత్వ నిషేధిత గడ్డిమందును విక్రయిస్తున్న మరో నిందితుడిని వరంగల్ టాస్క్‌ఫోర్స్, సంగెం పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేయగా మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ శనివారం తెలిపారు. రెండు సంఘటనల్లో సుమారు రూ.10లక్షల విలువైన 310కిలోల నకిలీ పత్తివిత్తనాలు, రెండుసెల్‌ఫోన్లు, రూ.10.10లక్షల విలువగల 122లీటర్ల నిషేధిత గడ్డి మందును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వివరాలిలా ఉన్నాయి.. వరంగల్ జిల్లా సంగెం మండలం గాంధీనగర్‌కు చెందిన నిందితుడు కోడూరి శ్రీనివాస్‌రావు వరుసకు మామ అయిన సూర్యాపేట జిల్లా తిరుమలగిరి ప్రాంతానికి చెందిన నగా మల్లేశ్వర్‌రావుతో కలిసి, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న గుంటూరు జిల్లా పెద్దకూరపాడుకు చెందిన ఏటుకూరి సుబ్బారావు వద్ద నకిలీ పత్తి విత్తనాలను తక్కువ ధరకు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ విత్తనాలు గ్లయోస్పెట్ గడ్డి మందును తట్టుకునే శక్తి కలిగి ఉండటంతోపాటు పత్తి దిగుబడి అధికమని, కలుపు తీయాల్సిన అవసరం తగ్గుతుందని, స్థానిక డీలర్ల వద్ద ఈ విత్తనాలు లభ్యం కావని తప్పుడు ప్రచారం చేసి రైతులను నమ్మించి నకిలీ పత్తి విత్తనాలను ఎక్కువ ధరకు విక్రయించేందుకు నిందితుడు శ్రీనివాస్‌రావు ప్రణాళిక రూపొందించుకున్నాడు. ఈనేపథ్యంలో పోలీసులకు అందిన పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్, సంగెం పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. దీంతో విక్రయానికి సిద్ధంగా ఉంచిన నకిలీ పత్తి విత్తనాలతోపాటు, ప్రభుత్వ నిషేధిత 50లీటర్ల గడ్డి మందును పోలీసులు స్వాధీనం చేసుకొని నిందితుడు శ్రీనివాస్‌రావును అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. మరో సంఘటనలో సంగెం మండలం, తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మెంతుల రాజేశ్ ప్రభుత్వ నిషేధిత గడ్డి మందును ఇంటి వద్ద అక్రమంగా విక్రయిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం రావడంతో రాజేశ్ ఇంట్లో తనిఖీ చేసి 72లీటర్ల గడ్డి మందును స్వాధీ నం చేసుకునట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ట్రెయినీ ఐపీఎస్ శుభం నాగ్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ జితేందర్ రెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఏసీసీ మధుసూదన్, ఇన్‌స్పెక్టర్లు సార్ల రాజు, రవికుమార్, ఎస్సైలు నిస్సార్‌పాషా, శరత్‌కుమార్, నరేష్, ఏఏఓ సల్మాన్ పాషా, మండల వ్యవసాయ అధికారి యాకయ్య, ఎస్సై ఉప్పలయ్య, హెడ్‌కానిస్టేబుళ్లు అశోక్, శ్రీనాథ్, మాధవరెడ్డి, కానిస్టేబుళ్లు రాజేశ్, భిక్షపతి, సురేష్, సాంబరాజు, నరేష్, కిరణ్, శ్రావణ్, సతీష్, శ్రీనివాస్, నాగరాజును సీపీ అభినందించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్



అన్నదాతలను నమ్మించి మోసం చేసి నకిలీ విత్తనాలను విక్రయిస్తే సహించేది లేదు. నకిలీ విత్తనాలు విక్రయించినా.. సరఫరా చేసినా పీడీ యాక్ట్ నమోదు చేస్తాం. నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే 87126 85070 వాట్సాప్ నంబర్ ద్వారా సమాచారం అందించండి.
- అంబర్ కిషోర్ ఝూ, వరంగల్ పోలీస్ కమిషనర్

భారం తగ్గించేందుకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు

- ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ: మండుటెండల్లోనూ మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు ముందస్తు చర్యలు తీసుకున్నట్లు తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. ముందస్తు ప్రణాళికలో భాగంగానే విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల భారం పడకుండా ఉండేందుకు అదనపు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేసినట్లు ఆయన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిసెంబర్ 2023 నుంచి మే 2024వరకు వివిధ కెపాసిటీగల 3,335అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చినట్లు వివరించారు. గత ఏడాది (డిసెంబర్ 2022 నుంచి మే 2023)లో 2,804 అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారని తెలిపారు. డిమాండ్ సమయంలో ట్రాన్స్‌ఫార్మర్లపై భారం తెలుసుకునేందుకు టాంగ్ టెస్టర్ రీడింగ్ తీసుకుంటున్నట్లు తెలిపారు. రీడింగ్ ఆధారంగా డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచుతున్నామని, తద్వారా ట్రాన్స్‌ఫార్మర్లపై భారం తగ్గిందని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు 25శాతం తగ్గాయని తెలిపారు. పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు కూడా 23శాతం తగ్గాయని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగం 303.6 మిలియన్ యూనిట్ల మైలు రాయిని చేరుకుందని వివరించారు. 33 కేవీ బ్రేక్ డౌన్స్, 33 కేవీ ట్రిప్పింగ్స్, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ వైఫల్యాలు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు తగ్గడంతో రాష్ట్ర విద్యుత్ డిమాండ్ తారాస్థాయికి చేరిందని తెలిపారు.

పెళ్లికి నిరాకరించాడని..

- మనస్తాపానికి గురై యువతి ఆత్మహత్యాయత్నం


108లో ఎంజీఎంకు తరలిస్తున్న సిబ్బంది

రాయపర్తి: ప్రేమించిన యువకుడు పెళ్లి చేసుకుంటానని చెప్పి గర్భవతిని చేసి తీరా పెళ్లికి నిరాకరించాడని మనస్తాపానికి గురై ఓ యువతి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. రాయపర్తి మండలం పెర్కవేడుకు చెందిన గాదె రాంబాబు, మంజుల దంపతులు గత కొంతకాలంగా రాయపర్తి మండల కేంద్రానికి బతుకుదెరువు కోసం వచ్చి జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో రాయపర్తికి చెందిన నరేశ్, నర్మద కొంత కాలంగా ఒకరినొకరు ప్రేమించుకున్నారు. ఈ క్రమంలో శారీరకంగా కలిశారు. దీంతో తనను పెళ్లి చేసుకోవాలని పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించినా ప్రియుడు నిరాకరించడంతో మనస్తాపం చెందిన యువతి పోలీస్‌స్టేషన్ సమీపంలో కూల్ డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకుని సేవించింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు 108లో వర్ధన్నపేట ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఎంజీఎంకు తరలించారు. ప్రస్తుతం యువతి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలి

- ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి


సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న వరదారెడ్డి

హసన్‌పర్తి: విద్యార్థినులు ఓ వైపు ఉద్యోగాలు చేస్తూనే మరోవైపు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి సూచించారు. హసన్‌పర్తి మండలం అన్నాసాగరంలోని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ప్లేస్‌మెంట్ మీట్-2024 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరదారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ మారుతున్న మార్పులకనుగుణంగా విద్యార్థినులు తమ నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. కాగ్నిజెంట్ టెక్నాలజీ మేనేజర్ జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులు లాజికల్ స్కిల్స్‌ను ఉపయోగించి కోడింగ్ సరళిలో మార్పులు తీసుకురావాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీరెడ్డి మాట్లాడుతూ పాఠ్యప్రణాళికతో పాటు ప్లేస్‌మెంట్‌కు సంబంధించిన లాజికల్ స్కిల్స్, కోడింగ్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై బీటెక్ మొదటి సంవత్సరం నుంచే ప్రణాళిక ప్రకారం శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీంతో వందశాతం ఫలితాలు సాధిస్తున్నట్లు వివరించారు. ఈ ఏడాది 282 మంది విద్యార్థినులు ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. అంతకుముందు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సుదర్శన్, డాక్టర్ మహేందర్, డాక్టర్ వాణిశ్రీ, ఏఓ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల రద్దు

కాజీపేట రూరల్: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో చేపట్టిన సీటీపీ వర్క్స్ కారణంగా కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్ల మీదుగా బల్లార్షా, విజయవాడ మార్గంలో ప్రయాణించే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను దక్షిణ మధ్య రైల్వే అధికారులు రద్దు చేశారు. ఈమేరకు జూన్ 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసినట్లు శనివారం కాజీపేట రైల్వే అధికారులు వెల్లడించారు.

రద్దయిన రైళ్ల వివరాలు


గుంటూరు-సికింద్రాబాద్ (17201) గోల్కొండ ఎక్స్‌ప్రెస్ జూన్ 2, 5, 6, 8, 9న, సికింద్రాబాద్-గుంటూరు (17202) గోల్కొండ ఎక్స్‌ప్రెస్ 2, 5, 6, 8, 9న, సికింద్రాబాద్- సిర్పూర్ కాగజ్‌నగర్ (17233) భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ 2, 5, 6, 8, 9న, సిర్పూర్ కాగజ్‌నగర్- సికింద్రాబాద్ (17234) భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ 2, 5, 6, 8, 9న సికింద్రాబాద్- విజయవాడ (12714) శాతవాహన ఎక్స్‌ప్రెస్ 2, 5, 6, 8, 9న, విజయవాడ- సికింద్రాబాద్ (12713) శాతవాహన ఎక్స్‌ప్రెస్ 2, 5, 6, 8, 9న రద్దు చేసినట్లు రైల్వే అధికారులు ప్రకటించారు.

వడదెబ్బతో ఇద్దరి మృతి


రంగయ్య మృతదేహం

చిట్యాల: వడదెబ్బకు గురై ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం మండల కేంద్రంలోని రంగయ్యపల్లిలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం...రేగొండ మండలం రంగయ్యపల్లి గ్రామానికి చెందిన కోవెల రంగయ్య (50) కొంత కాలంగా పురోహితం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇటీవల అతని తల్లిదండ్రులు, సోదరుడు మృతి చెందడంతో మద్యానికి బానిసై గ్రామంలో భిక్షాటన చేసుకుంటూ ఉండేవాడు. వారం రోజులుగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో వడదెబ్బకు గురికాగా స్థానికులు 108లో సివిల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మార్చురీలో ఉన్న రంగయ్య మృతదేహాన్ని ఎస్సై శ్రావణ్‌కుమార్ సందర్శించి ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

ఛాగల్లులో వృద్ధురాలు..


లచ్చమ్మ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఛాగల్లు గ్రామానికి చెందిన భాస్కుల లచ్చమ్మ(68) వడదెబ్బకు గురై శుక్రవారం రాత్రి మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం .. లచ్చమ్మ ఛాగల్లులో రేకుల ఇంటిలో నివాసం ఉంటుంది. రెండు రోజులుగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఇంటి వద్దనే ఉంటుంది. శుక్రవారం సాయంత్రం సొంత పనులపై గ్రామంలో బయటకు వెళ్లి వచ్చింది. కాస్త నలతగా ఉందని రాత్రి పడుకుంది. కుటుంబ సభ్యులు శనివారం ఉదయం వచ్చి చూసే సరికి మృతి చెందింది. వడదెబ్బకు గురై మృతి చెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మాల్‌ప్రాక్టీస్ కింద వాళ్లు బుక్..

ఆన్సర్‌బుక్‌లెట్స్ మార్చుకున్న విద్యార్థులపై చర్యలు?

- 65మంది విద్యార్థుల గుర్తింపు
- మరో 10మందికిపైగా దినసరి కూలీలు అదుపులోకి..
- రెండు ప్రైవేట్ కళాశాలల విద్యార్థులే ఎక్కువ
- వివిధ కోణాల్లో కొనసాగుతున్న విచారణ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ కోర్సుల జవాబు పత్రాల మార్పిడి వ్యవహారంపై కాకతీయ యూనివర్సిటీ పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఇప్పటికే ముగ్గురు కూలీలను మే 30వ తేదీన అదుపులోకి తీసుకొని విచారణ కొనసాగిస్తున్న పోలీసులు మరో 65మంది విద్యార్థులను గుర్తించి, వారిని మాల్‌ప్రాక్టీస్ కింద బుక్ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. కాగా, శనివారం కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ ఎస్సై రాజ్‌కుమార్ క్యాంపస్‌లోని పరీక్షల విభాగానికి వచ్చి ఈ వ్యవహారంపై ఆచార్య నర్సింహాచారితో మాట్లాడారు. పరీక్షల విభాగంలో పనిచేసిన మరో 16మందిని విచారించాలని ఎస్సై చెప్పడంతో ఆ జాబితా ప్రకారం ఆయా దినసరి వేతన కూలీలు, లంప్సమ్ ఉద్యోగులను అధికారులు పరీక్షల విభాగానికి రప్పించారు. దీంతో 10నుంచి 12మందిని పోలీసులు అదుపులోని తీసుకున్నట్లు పరీక్షల విభాగం అధికారుల ద్వారా తెలిసింది. ఇప్పటికే ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టడం, తాజాగా మరికొందరిని అదుపులోకి తీసుకోవడంతో మరిన్ని ఆసక్తికర విషయాలు వెలుగులోనికి వచ్చే అవకాశాలున్నాయనేది యూనివర్సిటీలో చర్చనీయాంశంగా మారింది.

ఆన్సర్ బుక్‌లెట్స్ మార్చుకున్న 65మంది విద్యార్థులు

వివిధ కళాశాలలకు చెందిన ఆరో సెమిస్టర్ పరీక్షలు రాసిన విద్యార్థులు సుమారు 65మంది తమ ఆన్సర్‌బుక్‌లెట్లను మార్చుకున్నట్లుగా ప్రాథమికంగా వెల్లడైనట్లు సమాచారం. అయితే దినసరి వేతన కూలీలతోపాటు క్యాంపస్‌లోని లంప్సమ్ ఉద్యోగులు కూడా ఆన్సర్‌బుక్‌లెట్‌లు మార్చారా.. అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఆ 65మంది విద్యార్థులు ఏఏ కళాశాలలకు చెందిన వారు.. వారు ఏ ఏ పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు రాశారు.. ఆయా విద్యార్థుల పేర్లు, హాల్‌టికెట్ నంబర్లు, అడ్రస్‌లను కూడా పరీక్షల విభాగం అధికారులు.. పోలీసులకు అందించినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో హనుమకొండలోని రెండు ప్రైవేట్ డిగ్రీ కళాశాలల విద్యార్థులే ఎక్కువమంది ఉన్నారని తెలుస్తోంది. ఆయా విద్యార్థుల గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇదిలాఉండగా.. ఈ వ్యవహారంలో ఆయా విద్యార్థులపై కూడా చర్యలు తీసుకోవాలని పరీక్షల విభాగం అధికారులు నిర్ణయించారని సమాచారం. 65మంది విద్యార్థులను మూడేళ్ల వరకు డీబార్ చేసే అవకాశం ఉంటుందని కేయూలో చర్చ జరుగుతుంది.

'మేడిగడ్డ, అన్నారం'లను సందర్శించిన బృందం


అన్నారంలో మరమ్మతులపై విశ్లేషిస్తున్న నిపుణుల బృందం

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ (లక్ష్మీ), అన్నారం(సరస్వతీ) బ్యారేజీల్లోని మరమ్మతులను ఈఎన్సీ జనరల్ అనిల్‌కుమార్‌తోపాటు నిపుణుల బృందం శనివారం పరిశీలించింది. వాటర్ రీసెర్చ్ (ఓయూ)డాక్టర్ రాజశేఖర్, నిట్ వరంగల్ ప్రొఫెసర్ రమణమూర్తి, మెకానికల్ డిపార్ట్‌మెంట్ సత్యనారాయణ, సీఈ సుధాకర్‌రెడ్డిలు ఎన్డీఎస్ఏ సూచించిన విధంగా మరమ్మతుల జరుగుతున్న విధివిధానాలను పరిశీలించారు. ముందుగా మేడిగడ్డ బ్యారేజీ అప్, డౌన్‌స్ట్రీమ్‌లను తనిఖీ చేశారు. సీసీ బ్లాక్ అమరిక, గేట్ల కటింగ్, షీట్‌ఫైల్స్ బిగింపు పనులను చూశారు. గ్రౌటింగ్ పనులను పరిశీలించారు. అక్కడినుంచి నేరుగా అన్నారం బ్యారేజీకి చేరుకున్నారు. సీపేజీ లీకేజీలకు చేపట్టాల్సిన వాటిపై సూచనలు చేశారు. అప్, డౌన్‌స్ట్రీమ్‌లో 5వేల మీటర్ల పొడువునా ఇసుకను తొలగించగా అక్కడ సీపేజీ లీకేజీలను పరీక్షించాలని సూచించారు. జియో టెక్నికల్, జియోఫిజికల్ పరీక్షలు చేయాలన్నారు. సీపేజీలు గుర్తించిన వెంటనే వర్షాకాలంలోపు సిమెంట్, ఇసుకతో గ్రౌటింగ్ పనులు ప్రారంభించాలని ఈఈ యాదగిరి, ఈఈ తిరుపతిరావులకు తెలిపారు. సీసీ బ్లాక్‌ల అమరిక త్వరగా పూర్తి చేయాలన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

LEASE / RENT

- G+3 Commercial Building 3600 Sq.ft. for Lease / Rent, Near REC Petrol Pump, Hanamkonda. Contact. Cell: 9000363463 [W-1242470]

LAND FOR SALE

- వరంగల్ ములుగు రోడ్డు నుండి కేవలం 10 KM దూరంలో బగలాపూర్‌లో మెయిన్ రోడ్‌కు 2nd బిట్టు 1=20 (ఒక్క ఎకరం ఇరవై గుంటలు), స్కూల్స్‌కు, కాలేజీలకు, ప్లాటింగ్ కొరకు etc. అనుకూలం. పక్క రిజిస్ట్రేషన్ గలది అమ్మకు Cell: 8331888842. [W-1242476]

PLOT FOR SALE

- About 250 Sq. Yards to 500 Sq. Yards Residential Plot For Sale. Near NIT, Beside Bishop Beretta School, FatimaNagar. Contact: Jayaraju: 9989635057, Praveen: 8008422520 [HA-13673]

SERVICES

BEAUTY PARLOUR

- శ్రీశైలీ బ్యూటీపార్లర్, హన్మకొండ మా పార్లర్‌లో గవర్నమెంట్ సర్టిఫికేట్‌తో బ్యూటీషియన్ కోర్సు ఫ్రీగా నేర్పించబడును. సంప్ర॥ 9989060668. [WA-5953]

హోమియో క్లినిక్

- డా॥బి. పవన్‌కుమార్, సీనియర్ హోమియో ఫిజీషియన్, 33 సం॥ల అనుభవ వైద్యులు. శ్రీ సాయి హోమియో క్లినిక్, విజయటాకీస్ రోడ్డు, హన్మకొండ. అన్ని రకాల వ్యాధులకు శాశ్వత పరిష్కారం కొరకు సంప్రదించండి. ఫోన్:8008623532. [W-1242411]

HEALTH CARE

- ఆత్మీయ రిహాబ్ సెంటర్ యందు వృద్ధులకు మరియు పక్షవాతం, సర్జరీ తరువాత రికవరీ కోసం క్యాన్సర్ పేషంట్స్ కొరకు అవసరమగు 24 గం॥ల సేవలు అందించబడును. ✆ 62814 76205, 94408 25526 [M-11669]

WANTED

- Wanted Receptionist for JP Constructions, Indhinagar, Vaddepalli, Hanamkonda. Contact: 9949033066. [WA-0396]
- శ్రీ సూర్య డిజిటల్ స్టూడియో హన్మకొండ చౌరస్తాలో అనుభవం గల స్త్రీలు కాని, పురుషులు కాని ఫోటో వెడ్డింగ్ ఆల్బమ్ వర్క్ వచ్చినవారు కావలెను. సెల్: 9399340444. [WA-5954]
- వరంగల్ స్టేషన్‌రోడ్డులో గల గోల్డెన్ లాడ్జిలో పని చేయుటకు మేనేజర్స్ (రిటైర్డ్ ఎంప్లాయిస్), రిసెప్షనిస్ట్ మరియు బాయ్స్ కావలెను. మంచి జీతం. సంప్ర॥ 9391864657. [W-1242456]
- ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185099]
- Jobs @ Hyderabad, (Helpers) 10th Pass / Fail, Age 18-30 yrs Salary Rs. 17000.00* + Bonus Call: 9121497015, 8954 333444 [HA-1122]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

WANTED TEACHERS

- To teach pre Primary, Science and Hindi for 1 to 7th, Bio & Physical Science, Maths, English for 7th to 10th. Masster High School, Fort WGL (East). 9347903778, 8790720106. [W-1242477]
- Wanted Teachers VI to X All subjects (EM) at Palakurthi Send Your Bio-data by Whatsapp No. 9949033066. [WA-0394]
- Higher Classes: Physical Science / Full Time 1st to 7th class: English. Sujatha Vidyanikethan High School, Hasanparthy, Contact: 9866574875. [W-1242475]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.